సామెతకథలు

# మొండి శిఖండి

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

శిఖండి పూర్వజన్మలో అంబ. ఈమెకు భీష్మునిపై వల్లమాలిన పగ. కఠినతపస్సు చేసిన ద్రుపదరాజుకు మొదటి కుమార్తెగా పుట్టింది. కాని తల్లిదండ్రులు కుమారుడని వెల్లడి చేశారు. ద్రోణుని వద్ద విలువిద్య నేర్చిందీమె. దశార్ణదేశానికి రాజైన హేమవర్మ తన కుమార్తెనిచ్చి మహావైభవంగా పెండ్లి చేశాడు. కాని యీతడు నపుంసకుడని వెల్లడి అయింది. హేమవర్మ కోపించి తన్ను మోసగించినందుకు ద్రుపదుని నగరం మీద దాడి చేశాడు. ద్రుపదుడు, ఆతని భార్య వియ్యంకునకు మొగము చూపలేక దాగుకొన్నారు.

శిఖండి స్థూలకర్ణుడనే యక్షుని అరణ్యానికిపోయి ప్రాయోపవేశం చేయడం మొదలుపెట్టాడు. యక్షుడు "అయ్యా! అనవసరంగా విలువైన ప్రాణాలను విడువబోకు. బ్రతికియుంటే ఎన్ని మంగళాలైనా పొందవచ్చు. ఇంతకు నీ కోర్కె యేమిటో తెలిపితే చేయగలిగినంత సాయం చేయడానికి యత్నిస్తాను." అన్నాడు.

శిఖండి తన కష్టాలు చెప్పుకొన్నాడు. స్త్రీత్వ విడచి పురుషరూపం వచ్చేమార్గం చెప్పుమన్నాడు. యక్షుడు అతని స్త్రీరూపం గ్రహించి తన పుంస్త్వమాతని కిచ్చాడు. శిఖండి బ్రహ్మానందభరితుడై యింటికి పోయాడు. నాటి నుండి స్వేచ్ఛగా, నిశ్చింతగా తిరగడం మొదలు పెట్టాడు. భీష్ముడు కురుపాండవ యుద్ధంలో ఒక్కరోజుననే దాదాపు అక్షౌహిణీ పాండవసైన్యాన్ని హతమార్చాడు. పాండవులు మిక్కిలి భీతచిత్తులై తాతవద్దకేగి, తమ్మనుగ్రహింపవలసినదని వేడుకొన్నారు.

సహజంగా ధార్మికశీలం గల పాండవులపై భీష్మునకు వాత్సల్యం మెండు. అందుచేత ఇట్లు పలికాడు. "ఓయీ! తీవ్రంగా యుద్ధం చేయకుంటే దుర్యోధనుడు, చేస్తే మీరు బాధపడుచున్నారు. నేనెట్లా కాలం గడిపేది? న్యాయం ఉన్నచోట విజయం ఏలాగూ తప్పదు. అది సిద్ధాంతమే కదా! ఇంతకూ నా యుద్ధ తీవ్రత తగ్గాలంటే స్త్రీలు, షండులు యుద్ధరంగంలో నా యెదుట నిలబడాలి. వారితో నేను పోరు చేయను. తరువాత విషయం మీరే చూచుకోండి." అన్నాడు భీష్ముడు.

పగతీర్చుకోడానికి అదేపనిగా అవకాశాలు వెదుకుతూన్న మొండి శిఖండి పాండవులకోర్కెపై మఱునాటి యుద్ధరంగంలో భీష్మునియెదుట ప్రత్యక్షమయ్యాడు. శిఖండిని ముందుంచుకొని వెనుకనుండి తీక్ష్ణ బాణపరంపర కురిపించడం మొదలుపెట్టాడు సవ్యసాచి. భీష్ముడు ప్రక్కకు తిరిగి యుద్ధంచేస్తున్నా వదలక శిఖండి ఎదురౌతూ వచ్చాడు. భీష్ముడు చికాకుపడుచూ అస్త్రసన్యాసం చేశాడు. వెనుకనుండి వచ్చిన పార్థుని తీవ్రబాణాఘాతాల చేత భీష్ముడు నేలపై వ్రాలాడు. ఈ విధంగా అంబ రెండవ జన్మ యెత్తి, శిఖండిగా పుట్టి, భీష్మునిపై పగ తీర్చుకొన్నది.

గట్టిపట్టుపట్టి కార్యం సాధించేవాడిని మొండి శిఖండి అనే పేరున పిలుస్తారు. *